
సాక్షి
కృష్ణాజిల్లా
శనివారం : 28 : సెప్టెంబర్ : 2024



ప్రశాంత వాతావరణంలో..
దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. -8లో▸



పులిచింతల నీటి నిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 32,115 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 51,069 క్యూసెక్కులు వదులుతున్నారు.

మర్యాదపూర్వకంగా..
చిలకలపూడి (మచిలీపట్నం): కృష్ణాజిల్లా రవాణా అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన జి.మనీష కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేశారు



న్యూస్‌రీల్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఎస్పీ గంగాధరరావు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం వల్ల నేరాలను నియంత్రించే అవకాశం ఉంటుందని ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. బంటుమిల్లి తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేర రహిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు ఇతర నేరాలు జరిగినప్పుడు వీటి ద్వారా నిందితులను గుర్తిస్తామన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని వీటి వల్ల నేరాలను, అసాంఘిక కార్యకలాపాలను జరగకుండా నియంత్రించవచ్చన్నారు. ప్రధాన కూడళ్లు, వ్యాపారాల సముదాయాల వద్ద సీసీ కెమెరా లు ఏర్పాటు చేస్తే రక్షణ కూడా ఉంటుందన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా గొల్లు కృష్ణ బాధ్యతల స్వీకరణ



మచిలీపట్నంటౌన్: కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా గొల్లు కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గొల్లు కృష్ణను రుద్రరాజు సత్కరించారు. రుద్రరాజు మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృష్ణ కృషి చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, వింత సంజీవరెడ్డి, ధనేకుల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్‌కి నిధులివ్వాలని వినతి



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం – రేపల్లె రైల్వేలైన్ దివిసీమ ప్రజల చిరకాల కోరిక అని, ఈ రైలుమార్గం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కలిసి ప్రాజెక్టు వివరాలను వివరించారు. బాలశౌరి మాట్లాడుతూ మచిలీపట్నం – రేపల్లె రైల్వేలైన్ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి డీపీఆర్ తయారుచేసే విధంగా చొరవ చూపాలన్నారు. దీనిపై స్పందించిన రైల్వే మంత్రి రైల్వే లైన్ నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారని ఎంపీ చెప్పారు.

నడకతో ఆరోగ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతిరోజూ నడకను అలవాటు చేసుకోవాలని వీ వైబ్ స్పోర్ట్స్ అండ్ ఈవెంట్స్ ఫౌండర్ రాగ వీణ అన్నారు. నడక ఆరోగ్యకరమని తెలియజేసేందుకు ఈ నెల 29వ తేదీన ఏబీఏ అమరావతి రన్ మంగళగిరి ఎస్ఆర్ఐ సర్కిల్ వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. అమరావతి రన్‌కు సంబంధించిన టీ షర్ట్, మెడల్స్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో శాప్ డెప్యూటీ డైరెక్టర్, ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్వీ రమణ, ట్రాఫిక్ సీఐ సూర్య భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం రాగ వీణ ఈ రన్ 3 కి.మీ, 5 కి.మీ, 10 కి.మీ చొప్పున మూడు విభాగాలుగా ఉంటుందన్నారు. విజేతలకు రూ. 2.40 లక్షల నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ శనివారం సాయంత్రం వరకు ఉంటుందని తెలిపారు.

రేపు 'వాక్ ఫర్ హార్ట్'

లబ్బీపేట(విజయవాడతూర్పు): వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని ఈ నెల 29న కార్డియాలజికల్ సొసైటీ ఆధ్వర్యంలో వాక్ ఫర్ హార్ట్ పేరుతో 5కే వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎ. పూర్ణానంద్, డాక్టర్ జె. శ్రీమన్నారాయణలు తెలిపారు. వాక్‌థాన్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు ఆవిష్కరించారు.

రియల్.. కుదేల్!

వరద దెబ్బకు పడిపోయిన రిజిస్ట్రేషన్లు

ఇటీవల కాలంలో విజయవాడ శివారు ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందుతున్నాయి. కోర్ సిటీలో స్థలాల లభ్యత లేకపోవడంతో అందరూ నగర శివారు ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ వచ్చింది. నిర్మాణాలు బాగా పెరిగాయి. సిటీలోని రణగొణ ధ్వనులకు దూరంగా ఉండాలనుకునేవారు, ప్రశాంతత కోరుకునే వారు కూడా అటువైపు ఇళ్లను కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బుడమేరు వరద ఎఫెక్ట్ వల్ల ఆ ప్రాంతాల్లో తాము ఉండలేమంటూ చాలా మంది బయటకు వస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా కుదేలైంది.



- బుడమేరు పరిసర ప్రాంతాలలో కొనుగోలు చేసేందుకు విముఖత
- ఇచ్చిన అడ్వాన్సులు వదులుకుంటున్న వైనం
- ఇళ్లు ఖాళీ చేస్తున్న వరద బాధితులు
- అయోమయంలో బిల్డర్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద రియల్‌ఎస్టేట్ రంగాన్ని ఛిదిమేసింది. ఇప్పటి వరకు నగరంలోని తక్కిన ప్రాంతాలతో దీటుగా రామకృష్ణాపురం, దేవీనగర్ గద్దె వెంకట్రామయ్య నగర్, దావుబుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, గుణదల, అజిత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాలలో క్రయ విక్రయాలు జరిగేవి. ఆ పరిసర ప్రాంతాలలో గజం రూ. 35వేల నుంచి రూ. 45వేల వరకు వెళ్లింది. ఈ ప్రాంతాలలో బుడమేరు వరద ప్రభావం ఉండదని రియల్టర్లు ప్రచారం చేయటంతో కనీసం మురుగుకాలువలు, రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు, లే అవుట్‌లు లేకున్నప్పటికీ పెట్టుబడిదారులు, బ్రోకర్‌లు ఎగబడి కొనుగోలు చేశారు. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

కొనుగోలుదారులు హడల్..

ఈ ప్రాంతాలలో బుడమేరు వరద పోటెత్తటంతో ఇటువైపు కొనుగోలుదారులు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికే అడ్వాన్సులు ఇచ్చిన వారు సైతం వాటిని వదిలేసుకుంటున్నారు. తమకు వరద ముంపు బెడద ప్రాంతాలు అవసరం లేదంటూ కొనుగోలు దారులు తెగేసి చెప్పటంతో కృత్రిమంగా రేట్లను పెంచేసి అధిక రేట్లకు విక్రయిస్తున్న బ్రోకర్‌లు భయాందోళనలకు గురవుతున్నారు. తాము పెట్టిన పెట్టుబడిలో సగం కూడా వస్తుందో రాదోనంటూ బెంబేలెత్తిపోతున్నారు. ఆయా ప్రాంతాలలో నిర్మాణాలు చేస్తున్న బిల్డర్‌లు ఫ్లాట్‌లను కొనుగోలు చేసేవారు ముందుకు రాకపోవటంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాలలో కొనుగోలుదారులు అధికంగా ఉండటంతో బిల్డర్‌లు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి మరీ అనధికారిక నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇప్పుడు ఆ ఫ్లాట్‌లు అమ్ముడవుతాయో లేదో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

అద్దెకు కూడా వద్దు..

ఏ సౌకర్యాలు లేకున్నప్పటికీ ప్రశాంతంగా ఉండవచ్చనే ఉద్దేశంతో ఈ ప్రాంతాలకు వచ్చి అద్దెకుంటున్న వారు కూడా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. వరద వల్ల పడిన కష్టాలు చాలని వేరే ప్రాంతాలకు వెళ్లిపోతామని చెబుతున్నారు. ప్రభుత్వం వరద సాయం ఇచ్చేస్తే ఇళ్లు ఖాళీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. దీంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన నిర్మాణాల ఈఎంఐలు ఏ విధంగా కట్టాలోనని భవన యజమానులు ఆందోళన చెందుతున్నారు.

వరద సాయం అందేనా?

వరద నీరు ముంచెత్తిన గద్దె వెంకట్రామయ్యనగర్, వినాయకనగర్, దావు బుచ్చయ్యకాలనీలో వరద సాయం ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని ఇళ్లలోకి ప్రవేశించగా మరికొన్ని ఇళ్ల వద్ద రోడ్లపై నడుంలోతు నీళ్లు రోజుల తరబడి నిలిచిపోయాయి. అయితే అధికారులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్‌లు

ఆయా ప్రాంతాల్లో ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. కొనుగోలుదారులు అక్కడ వేటినీ కొనేందుకు ముందుకు రావడం లేదు. బుడమేరు వరదకు ముందు గాంధీనగర్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సుమారు 70 నుంచి 80వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం కేవలం సుమారు 30 రిజిస్ట్రేషన్ల వరకు మాత్రమే జరుగుతున్నాయి. అలాగే గుణదల రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సుమారు 30 నుంచి 40 రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. ప్రస్తుతం 10 నుంచి 20 రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరుగుతున్నాయి. వాటిలో కూడా వీలునామా, మార్ట్‌గేజ్ తదితర రిజిస్ట్రేషన్‌లు ఎక్కువ. కొనుగోలుదారులు వరద ముంపు ప్రభావం లేని ప్రాంతాల వైపు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

జీజీహెచ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

మచిలీపట్నంటౌన్: జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం విధులు బహిష్కరించటంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తింది. ఆస్పత్రిలో ఎక్కడి వ్యర్థాలు అక్కడే పేరుకుపోయాయి. దీంతో రోగులు ఉండే వార్డులతో పాటు ఆవరణ, రోగులకు వినియోగించి సిరంజులు, సెలైన్ బాటిళ్లు, గాయాలకు కట్టు కట్టిన వ్యర్థాలు వంటివి డస్ట్‌బిన్లలో పేరుకుపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. రోగులు ఇబ్బందులు పడ్డారు.

వివరాలు ఇవి..

మెడికల్ కళాశాల ప్రారంభం సమయంలో 50 మంది కార్మికులతో భవనాల వద్ద పనులు చేయించారు. వారికి ఇవ్వాల్సిన పారితోషకాన్ని ఇటీవల పంపిణీ చేశారు. ఆ సమయంలో పారిశుద్ధ్య కార్మికుడు ఎం. ఫణీంద్ర తన ఆటోలో కార్మికులను ఆస్పత్రికి తరలించాడు. పనిచేసిన పారితోషకంతో పాటు ఆటో కిరాయి ఇచ్చే విషయమై సూపర్‌వైజర్లు ప్రసన్న, నీరజ కార్మికులకు మధ్య వివాదం చోటు చేసుకుంది. గొడవ పెరగటంతో ఫణీంద్ర గొడవకు కారణమయ్యాడని విషయమై అతన్ని విధుల నుంచి తొలగించాలని సూపర్‌వైజర్లు ఇద్దరూ కార్మికుల నిర్వహణ సంస్థ ఎండీకి ఫిర్యాదు చేసి, తొలగించాలని సిఫార్సు చేసినట్లు కార్మికులు చెబుతున్నారు. కార్మికుల కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఫణీంద్రను విధుల నుంచి తొలగించినట్లు, సూపర్‌వైజర్లను ఇకపై పేర్లతో పిలవకుండా సార్.. మేడమ్.. అని సంబోధించాలని సూపర్‌వైజర్లు రాశారని చెబుతున్నారు. అకారణంగా ఫణీంద్రను విధుల నుంచి తొలగించటం సరికాదని ఆస్పత్రిలో పనిచేస్తున్న 106 మంది కార్మికులు మూకుమ్మడిగా శుక్రవారం విధులను బహిష్కరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు వారి నిరసన కొనసాగుతూనే ఉంది. ఫణీంద్రను విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. వివాదానికి కారణమైన సూపర్‌వైజర్లు, సఫాయీ కర్మచారి సంఘం నాయకుడు జయకర్‌బాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటేనే..

ఆందోళన విరమించాలని ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, ఆర్ఎంవో నిరంజనకుమార్, కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వడ్డి రమేష్ కోరగా ఫణీంద్రను విధుల్లోకి తీసుకుంటామని, సూపర్‌వైజర్లు ఇద్దరిపై చర్యలు తీసుకుంటామని రాతపూర్వకంగా హామీ ఇస్తేనే తాము ఆందోళన విరమిస్తామని కార్మికులు చెబుతున్నారు. దీనిపై అధికారుల నుంచి స్పందన రాకపోవటంతో కార్మికులు నిరసన కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ వివాదం ఇలా ఉంటే కార్మికులు ఒకరిపై ఒకరు పోలీస్ కేసులు పెట్టుకునే వరకు వెళ్లటం గమనార్హం.

సుబాబుల్‌కు రికార్డు ధర

- టన్ను కర్ర రూ.6,200
- కాగిత పరిశ్రమలకు కర్ర కొరతతో పెరిగిన డిమాండ్

పెనుగంచిప్రోలు: సుబాబుల్ కర్రకు గతంలో ఎన్నడూ లేని విధంగా డిమాండ్ పెరిగింది. కాగిత పరిశ్రమలకు కర్ర కొరత రావటంతో టన్నుకు రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. గత కొన్నేళ్లుగా దిగుబడి తగ్గటంతో పాటు కేవలం టన్ను రూ.2 వేలు మాత్రమే ఉండటం, ఎండు తెగుళ్లు కూడా సోకటంతో రైతులు సుబాబుల్ తోటలను పీకేసి వాణిజ్య పంటలు సాగు చేశారు. దీంతో రానురాను సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఫలితంగా డిమాండ్‌కు తగ్గ కర్ర లభించటం లేదు. ప్రస్తుతం టన్ను సుబాబుల్ కర్ర రూ.6,200కు పైగా పలుకుతోంది.

గతంలో లక్ష ఎకరాలకు పైగా సాగు..

గతంలో ఎన్టీఆర్ జిల్లాలోని మెట్ట పొలాల్లో లక్ష ఎకరాల వరకు సుబాబుల్ సాగు జరిగేది. గిట్టుబాటు ధర లేక తోటలు రైతులు పీకేయటంతో ప్రసుత్తం 40 నుంచి 50 వేల ఎకరాల లోపు మాత్రమే ఉంది. మూడేళ్ల తరువాత వచ్చే పంటలకు గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు సాగును వదిలేశారు. ఉత్పత్తులు లేక పోవటంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. గత ఏడాదిలోనే టన్ను సుబాబుల్ ధర రూ.5,600కు పైగా పలికింది. ప్రస్తుత డిమాండ్ దృష్ట్యా ఐటీసీ భద్రాచలం, బలార్షా, రాజమండ్రి ఏపీఎం, సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లులు కర్ర కొనుగోలుకు పోటీపడుతున్నాయి.



కాటాల వద్ద లారీలకు ఎత్తుతున్న సుబాబుల్ కర్ర

పెరుగుతున్న విస్తీర్ణం...

కర్రకు డిమాండ్ పెరగటంతో పాటు వాణిజ్య పంటలు సాగు చేసి నష్టపోతున్న రైతులు తిరిగి సుబాబుల్ సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 10 వేల ఎకరాలకు పైగా సాగు పెరిగింది. మరింత పెరిగే అవకాశం ఉంది.

టన్ను రూ.6,200 పైనే..

గత ఏడాది రూ.2,500 నుంచి రూ.2,800 వరకు పలికిన టన్ను సుబాబుల్ ధర అమాంతం రూ.5,700కి పెరిగింది. ప్రస్తుతం రూ.6,200 పలుకుతోంది. కంపెనీలు కర్ర కొట్టినందుకు ముఠా కార్మికులకు టన్నుకు రూ.600, ట్రాక్టర్‌కు రూ.250, లారీకి భద్రాచలం అయితే రూ.800, బలార్షా రూ.1200, ఎస్పీఎం రూ.1100, ఏపీఎం రూ. 900 చెల్లిస్తూ, రైతులకు ఖర్చు అన్నీ పోను టన్నుకు రూ.6,200 చెల్లిస్తున్నారు.

కంపెనీలకు కర్ర అవసరం.



సుబాబుల్ పంట తగ్గిపోవటంతో పేపర్ కంపెనీలకు అవసరమైన కర్ర రాకపోవటంతో డిమాండ్ బాగా పెరిగింది. కంపెనీలు కర్ర కొనుగోలుకు పోటీ పడుతున్నాయి. ఈ ధర ఎప్పుడూ ఉంటే రైతుకు లాభంగా ఉంటుంది.

– గుంటుపల్లి వాసు, రైతు, ముండ్లపాడు

ఒక్కసారిగా పెరిగిన ధర..



సుబాబుల్ ధర గత ఏడాది అమాంతంగా రూ.5,700 వరకు పెరిగింది. ప్రస్తుత డిమాండ్ దృష్ట్యా రూ.6.200 నుంచి రూ.6,500 వరకు కూడా కర్ర కొడుతున్నారు. సాగు విస్తీర్ణం తగ్గటం వల్లే డిమాండ్ వచ్చింది. రైతులు మళ్లీ సుబాబుల్ సాగుపై దృష్టి పెట్టారు.

– నంబూరి వాసు, రైతు, నవాబుపేట

వ్యర్థానికి కొత్త అర్థం

విజయవాడలో 'వేస్ట్ టు ఆర్ట్ గ్యాలరీ' ప్రారంభం



గుర్రం కళాఖండాన్ని ఆసక్తిగా పరిశీలిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): స్వచ్ఛతా హీ సేవా కల్చరల్ ఫెస్ట్‌ను పురస్కరించుకుని విజయవాడ డివిజన్‌లో ఏర్పాటు చేసిన 'వేస్ట్ టూ ఆర్ట్' ప్రదర్శన వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విజయవాడ రైల్వే ఆడిటోరియంలో శుక్రవారం రీ సైక్లింగ్ వ్యర్థాలతో సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా వ్యర్థాల ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ గ్యాలరీని లాంఛనంగా ప్రారంభించి ప్రదర్శనలో ఉన్న కళారూపాలను వీక్షించారు. ఇందులో విజయవాడ, కాకినాడ, నర్సాపూర్, మచిలీపట్నం డిపోలకు చెందిన సిబ్బంది రోజువారీ వ్యర్థాల నుంచి సృజనాత్మకతతో రూపొందించిన పలు కళాఖండాలను ప్రదర్శించగా అందులో విజయవాడ వ్యాగన్ డిపో సిబ్బంది మెటల్ స్క్రాప్‌తో తయారు చేసిన గుర్రం కళాఖండం విశేషంగా ఆకట్టుకుంది.

ఆరోగ్యకర సమాజం కోసం..

ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ పదో వార్షికోత్సవం సందర్భంగా డివిజన్‌లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం జరుపుకోవడం ఆనందాయకమన్నారు. ఇది ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన దేశ నిర్మాణంలో పురోగతి సాధించడంలో ఎంతో దోహదపడుతుందని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం డీఆర్ఎం వారికి జ్ఞాపికలను అందజేశారు. ఏడీఆర్ఎంలు పీఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరాచారి



కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సుందరాచారి

చిలకలపూడి(మచిలీపట్నం): అల్జీమర్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారి అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో హెచ్‌వోడీ, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 60ఏళ్లు పైబడిన వారికి ఈ వ్యాధి వస్తుందన్నారు. ఈ వ్యాధితో మతిమరుపు, పేర్లు గుర్తుంచుకోకపోవటం, రాత్రిళ్లు నిద్రలేకపోవటం, రోడ్లపై తిరగటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ వ్యాధి జన్యులోపాల వల్ల వస్తుందన్నారు. దీనికి బ్రెయిన్ స్కాన్ నిర్వహించి రిపోర్టుల ఆధారంగా న్యూరాలజిస్టును సంప్రదించాలన్నారు. వ్యాధి సోకిన వారితో కుటుంబ సభ్యులు వారికి అనుకూలంగా ఉంటూ మందులు వినియోగిస్తే వ్యాధి తగ్గే అవకాశం ఉందన్నారు. మంగళగిరి ఎన్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రమోద్ వ్యాధి ఎలా వస్తుంది? ప్రారంభ లక్షణాల గురించి వివరించారు. ఎక్స్‌ప్రెస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. విజయ కుమారి, సెల్యూలార్ బేసిస్ ఆఫ్ అల్జీమర్స్ వ్యాధిపై, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ ప్యాతోజెన్సిస్ ఆఫ్ అల్జీమర్ వ్యాధిపై, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గీతావాణి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అరుణ, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ప్రదీప్, బయోకెమిస్ట్రీ విభాగం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తరలింపునకు చర్యలు

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి, తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో పంచాయతీ, మునిసిపల్ అధికారులతో ఎలక్ట్రానిక్ వ్యర్థాల తరలింపుపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాలు, పట్టణాలు, గృహాలు తదితరాల నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించాలని సూచించారు. జిల్లాలో 497 గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల నుంచి 1.5 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వీటిని పోతేపల్లి వద్ద నిల్వ చేయాలని అక్కడి నుంచి రీసైక్లింగ్ కోసం సంబంధిత పరిశ్రమకు పంపేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా నిర్వహించేందుకు మేజర్ పంచాయతీల్లో కియోస్క్‌లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి జె. అరుణ, మచిలీపట్నం నగర పాలక సంస్థ మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

క్లుప్తంగా

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయండి

కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించి గృహనిర్మాణాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని లేఅవుట్లు, కమ్యూనిటీ హాళ్లలో గృహనిర్మాణ లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధుల సహకారంతో గృహనిర్మాణ పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గృహాలు వచ్చే సంవత్సరం మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే గృహాలు మంజూరైన వారికి యూనిట్ విలువ పెంచుతారనే అపోహ పడవద్దని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఏమైనా ఆర్థిక సాయం అవసరమైతే పొదుపు సంఘాల సభ్యులకు రుణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గృహనిర్మాణానికి కావాల్సిన స్టీలు, సిమెంటు, ఇసుక తదితర సామగ్రిని, కూలీలు, మేస్త్రీలను కూడా సమకూరుస్తామని తెలియజేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో హౌసింగ్ ఈఈ వెంకట్రావు, డీఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 45 మంది ఎంపిక



చిలకలపూడి(మచిలీపట్నం) జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన శాఖ, డీఆర్డీఏ – సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 45 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. పోతేపల్లి ఇమిటేషన్ జ్యూయలరీ పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, గోల్డ్ ప్రిన్స్ జ్యూవెల్ ఇండస్ట్రీ ఇండియా లిమిటెడ్, సుధ గోల్డ్, యశశ్రీ, వీఎస్ఆర్ తదితర రోల్డ్ గోల్డ్ సంస్థల ప్రతినిధులు హాజరై 45 మందిని ఎంపిక చేసి వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్‌బాబు, సీడాప్ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సూర్యనరేంద్ర, ఇమిటేషన్ జ్యూయలరీ పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అంకెం జితేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఉపద్రవాల నుంచి అవకాశాలను అందిపుచ్చుకుని ద్రవ్యాలను పోగేసుకోవడం టీడీపీ నాయకులకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదేమో.... అందులో వారు ఘనాపాఠీలు అని చెప్పవచ్చు. వరదలకు వాగులు, వంకలు పొంగి పొర్లి ఇసుక మేటలు వేసింది. ఆ మేటలే ఇప్పుడు వారికి కాసుల మూటలయ్యాయి. రేయింబగళ్లూ నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుకను తోడేస్తూ లక్షలకు లక్షలు జేబుల్లో నింపుకొంటున్నారు. ఇష్టం వచ్చినట్టు వాగుల్ని తోడేస్తుంటే...వాగు భౌతిక స్వరూపమే మారిపోతున్నా వీరి ఆగడాలు మాత్రం ఆగడం లేదు. నియంత్రించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

కోతులవాగులో ఇసుక తోడేళ్లు



రెడ్డిగూడెం కోతుల వాగులో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

- అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో ఇసుక అక్రమ రవాణా
- కన్నెత్తి చూడని అధికారులు
- ట్రాక్టరు ఇసుకకు రూ.4వేలు వసూళ్లు

జి.కొండూరు(రెడ్డిగూడెం): ఇటీవల వచ్చిన భారీ వరదలు అధికార పార్టీ నాయకులకు వరంగా మారాయి. వాగులన్నీ పొంగి పొర్లడంతో మేటలు పెట్టిన ఇసుక ఇప్పుడు టీడీపీ నాయకులకు కాసులు కురిపిస్తోంది. అధికారులు సైతం నాయకులతో కుమ్మక్కైపోవడంతో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగిపోతోంది. రెడ్డిగూడెం శివారులో ఎన్ఎస్పీ కాల్వ దిగువన ఉన్న కోతుల వాగులో గత రెండు రోజులుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే నాథుడే కరువయ్యాడు. వాగులో పొక్లెయిన్‌తో ఇసుకను తోడుతూ వందల ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. వాగులో నీరు ఉన్నప్పటికీ లోతైన గొయ్యిలు పెట్టి మరీ తోడేస్తున్నారు. ఇదే విధంగా వాగును తోడేస్తే వాగు భౌతిక స్వరూపమే మారిపోయే ప్రమాదం ఉందని సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తోడిన ఇసుకను తరలించి ట్రాక్టరుకు రూ.3వేల నుంచి 4వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వందల ట్రాక్టర్ల ఇసుకను రవాణా చేసేందుకు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుంటే గ్రామంలో రహదారి పైకి రావాలంటేనే భయమేస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టపగలే బహిరంగంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కోతులవాగులో ట్రాక్టరుకు ఇసుకను లోడు చేస్తున్న పొక్లెయిన్

వడ్డీతో వాహనం విలువను చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వాహనదారునికి వడ్డీతో సహా వాహన విలువను చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యురాలు శ్రీలక్ష్మీరాయల శుక్రవారం తీర్పు చెప్పారు. అవనిగడ్డకు చెందిన కె.కిషోర్‌బాబు ఎన్.వెంకటరమణ దగ్గర మోటార్ సైకిల్‌ను కొనుగోలు చేశారు. అనంతరం ఆర్సీలో పేరు మార్చుకున్నారు. ఇన్సూరెన్స్‌లో పేరు మార్పించుకోవటం కుదరలేదు. కిషోర్ సొంత పని మీద ఊరు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కొన్ని రోజులు వెతికి బండి కనిపించటం లేదని సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో ఆయన ఇన్సూరెన్స్ కంపెనీ అయిన గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదించగా ఇన్సూరెన్స్ మీ పేరు మీద లేదని తిరస్కరించారు. ఎన్ని సార్లు తిరిగినా ఫలితం లేకపోవటంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన అనంతరం కమిషన్ సభ్యులు కిషోర్ బాబుకు బండి విలువ రూ.34,184ను 2022 ఆగస్టు 26వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదన కలిగించినందుకు రూ.10 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు 30 రోజుల్లోగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

దసరా ఉత్సవాలపై పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భక్తులు అందరూ ఆనందోత్సాహాలతో శాంతి భద్రతల మధ్య ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో బందోబస్తు సిబ్బంది ఉపయోగించే పరికరాలైన బెల్ హెల్లర్స్, రోప్, మైక్ సాధనాలు, లైట్స్‌లను శుక్రవారం సీపీ పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించి అన్ని ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అక్కడున్న అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమి సాలి, ఉదయరాణి పాల్గొన్నారు.



సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లోని బెల్ హెల్లర్స్, రోప్, మైక్ సాధనాలు, లైట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

జగన్‌ను అడ్డుకోవడం అన్యాయం

కైలే అనిల్‌కుమార్, పామర్రు మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమలకు వెళ్లకుండా అడ్డుకోవడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి సభ్యులు మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం వారి కుసంస్కారానికి నిదర్శనం అన్నారు. జగన్ తిరుపతి పర్యటనను రాజకీయం చేసినందునే పర్యటన రద్దు చేసుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఇంతవరకు ప్రజలకు చేసిందేమిటని ప్రశ్నించారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలపై ప్రజలను పక్కదారి పట్టించే విధంగా కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిట్రిక్స్ చేస్తోందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే అలవాటు చంద్రబాబుకు ఎప్పుడూ లేదన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తోట్లవల్లూరు మండలం లంక గ్రామాల రైతులకు వరదల కారణంగా నష్టపోయిన వారికి ఒకొక్కరికి రూ.లక్ష ఇన్సూరెన్సుగా అందించామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం లంక రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలను కూడా సక్రమంగా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.

నేడు మంటాడ ఆలయంలో ప్రత్యేక పూజలు

చంద్రబాబు నాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం ఉదయం 9 గంటలకు మంటాడ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించనున్నట్లు అనిల్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ ఈ పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మోరా వెంకటరెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంలోనూ అదుర్స్

- గత రెండున్నర ఏళ్లలో రెట్టింపు
- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- మోపిదేవి దేవస్థానం ఇన్‌చార్జి డీసీ అండ్ ఈవో చక్రధరరావు



మోపిదేవి: రాష్ట్రంలో ఎంతో ప్రాశస్త్యం పొందిన మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం ఆదాయ పరంగా కూడా గత రెండేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించింది. బదిలీపై వెళుతున్న సందర్భంగా ఏసీ సూర్య చక్రధరరావు గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో తన హయాంలో (జూలై, 2022–ఆగస్టు, 2024) జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. గత రెండేళ్లలో దేవస్థానంలో తీసుకువచ్చిన నూతన పూజలు, భక్తులకు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో అన్నప్రసాదం ఏర్పాటు ద్వారా కూడా దేవస్థానానికి విరాళాలు బాగా పెరిగాయని వివరించారు.

రూ.22.75 కోట్ల నిల్వ

గత 30 ఏళ్లలో డిపాజిట్ చేసిన మూలనిధులు జూన్ 30, 2022 నాటికి రూ.8 కోట్లు కాగా, గత రెండేళ్లలో డిపాజిట్ చేసిన మూల నిధులు జూలై 1, 2022 నుంచి ఆగస్టు 31, 2024 నాటికి రూ. 14.75 కోట్లు మొత్తం రూ. 22.75 కోట్లు నిల్వ చేసినట్లు వివరించారు. పుష్కరిణి అభివృద్ధి పనులకు సీజీఎఫ్ మ్యాచింగ్ రూ.1 కోటి, దేవస్థానం నిధులు రూ.50 లక్షలతో మోపిదేవి పుష్కరిణి పనులు పూర్తి చేసినట్లు, రూ.40 లక్షలతో అన్నప్రసాదానికి పెద్ద హాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మోపిదేవికి ఇరువైపులా ప్రధాన స్వాగత ద్వారాలు రూ.15 లక్షలతో ఏర్పాటు చేసినట్లు, డ్రైనేజీ రూ.20 లక్షలతో నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్ క్యూలైన్‌కు రూ.50 లక్షలతో స్టీల్ క్యూలైన్స్ ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు వివరించారు. ప్రధానంగా మూడు దేవస్థానాలు మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం, పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానం, శ్రీకాకుళం శ్రీ కాకుళేశ్వరస్వామివారి దేవస్థానాల్లో రూ. 9.75 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

పెనమలూరు: తాడిగడప వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పెనమలూరు ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం పోరంకి సుగాలి కాలనీకి చెందిన బాణావత్ అశోక్(23) తాడిగడపలో ఓ హోటల్‌లో పని చేస్తాడు. అతనికి తల్లిదండ్రులు లేరు. అవివాహితుడు. శుక్రవారం తాడిగడపకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తూ ఆర్టీసీ సిటీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి బస్సు కింద పడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్రభవానిపై సస్పెన్షన్ వేటు పడింది. హైస్కూల్ ప్లస్ విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు వారి తల్లిదండ్రులతో గొడవపడి పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు హెచ్‌ఎంపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో సరైన వసతులు లేవని ఇటీవల విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ విషయమై విద్యార్థినుల తల్లిదండ్రులకు, హెచ్‌ఎం రవీంద్రభవానికి మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యార్థినుల తల్లిదండ్రులపై పోలీసులకు హెచ్‌ఎం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపించి నివేదికను పాఠశాల విద్యాశాఖకు సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు హెచ్‌ఎం రవీంద్రభవానిని సస్పెండ్ చేస్తున్నట్లుగా కాకినాడ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఈ నెల 26న ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆమెపై సస్పెన్షన్ కొనసాగుతుందని అందులో పేర్కొన్నారు. ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ ముందస్తు అనుమతి పొందకుండా సదరు హెచ్‌ఎం హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లరాదని కూడా ఆదేశించారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు చెక్కును అందజేస్తున్న కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

పెడన: విజయవాడ వరద బాధితుల కోసం మండల పరిధిలోని శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థుల ద్వారా సేకరించిన రూ.లక్ష విరాళాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యేకు అందజేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాబా, డిప్లొమా ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో కర్ణాటక అటవీ శాఖ మంత్రి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కర్ణాటక రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ పర్యవేక్షకుడు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉపకార వేతనాలు

పెనమలూరు: ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా ఉండి వారికి ఉపకార వేతనాలు అందజేస్తామని సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో శుక్రవారం ఉపకార వేతనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తమ కాలేజీలో మంచి ప్రతిభ చూపిన 485 మంది ఉత్తమ విద్యార్థులకు రూ 1,50,90,000 ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులలో ప్రమాణాలు పెంచటానికి, ఆర్థికంగా సహకరించటానికి యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్, ఈఏపీసెట్, ఇంటర్ మార్కులు, సిద్ధార్థలో ఎంట్రన్స్ మార్కుల ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేసి ఉపకార వేతనాలు ఇచ్చామన్నారు.